ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
మంగళవారం 5 మార్చి 2024



వేములవాడ అభివృద్ధిని విస్మరించిన కేసీఆర్
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ 6

6 పద్మశాలీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి



నిధులపై సన్నగిల్లిన ఆశలు

- 2024 - 25 బల్దియా బడ్జెట్ రూ.84.32 కోట్లు
- గత బడ్జెట్ కంటే 5.33 కోట్లు మాత్రమే పెంపు
- జనవరి వరకు వచ్చిన ఆదాయం రూ.50.27 కోట్లు
- విలీన గ్రామాలకు రూ.52 లక్షల నిధులు
- సిరిసిల్ల మున్సిపల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల బల్దియా అంచనా బడ్జెట్ రూపకల్పన చూస్తే కౌన్సిల్‌కు ఆశలు సన్నగిల్లినట్లుగా కనిపిస్తున్నాయి. బడ్జెట్ అంచనా స్వల్పంగా మాత్రమే పెరిగింది. 2024-25 సంవత్సరానికి రూ.84.32 కోట్ల అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. గత సంవత్సరం బడ్జెట్ కంటే రూ.5.33 కోట్లు మాత్రమే పెంచారు. సోమవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అధ్యక్షతన 2024-25 అంచనా బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ప్రారంభోపన్యాసం చేశారు. కౌన్సిలర్లు పద్దులపై చర్చలు జరిపారు. గడిచిన ఐదారేళ్లుగా బడ్జెట్‌ను అంకెల్లో అమోఘంగా చూపుతున్నా ఆచరణలో మాత్రం సన్నగిల్లుతూనే వస్తోంది. 2023 - 24 అంచనా బడ్జెట్ 78.99 కోట్లతో ఆమోదించారు. జనవరి వరకు రూ.50.27 కోట్లు ఆదాయం సమకూరింది. బీఆర్‌ఎస్ పాలకవర్గం కొనసాగుతుండగా గతంలో ప్రభుత్వం కూడా బీఆర్‌ఎస్ ఉన్న నేపథ్యంలో సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కే తారకరామారావు సిరిసిల్ల పట్టణ రూపురేఖలు మారే విధంగా అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను కేటాయించారు. కొత్త ప్రభుత్వం రావడంతో నిధుల అంచనాలను వేయలేకపోయారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గత బడ్జెట్‌లో పన్నుల రూపంలో రూ.5.89 కోట్లు అంచనా వేశారు. ఈ సారి రూ.5.91 కోట్లు పొందుపర్చారు. నాన్ ట్యాక్సెస్ రూపంలో గత బడ్జెట్‌లో రూ.13.22 కోట్లు, పొందుపర్చగా ఈ సారి రూ.10.81 కోట్లకు తగ్గింది. నాన్ ప్లాన్ గ్రాంట్లలో గతేడాది రూ.8.49 కోట్లు పొందుపర్చగా ఈసారి బడ్జెట్‌లో రూ.16.77 కోట్లు పెట్టుకున్నారు. ప్లాన్ గ్రాంట్లలో గతేడాది రూ.4.70 కోట్లు పెట్టుకోగా ఈసారి రూ.70 లక్షలు, ఇతర గ్రాంట్ల నుంచి గత సంవత్సరం రూ.45.63 కోట్లు అంచనా వేయగా రూ.35.35 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ సారి రూ.49.22 కోట్లకు పొందుపర్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

● విలీన గ్రామాల్లోనే సమస్యలు

సిరిసిల్ల బల్దియాలో విలీనం చేసిన రగుడు, చంద్రంపేట, చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లి, పెద్దూర్, సర్దాపూర్, జెగ్గారావుపల్లె గ్రామ పంచాయతీలు వార్డులుగా మారాయి. ఈ ప్రాంతాల్లో మంచినీరు, రోడ్డు, మురికి కాలువలు వంటి సమస్యలతో సతమతం అవుతున్నారు. వార్డుల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.52 లక్షలు మాత్రమే కేటాయించారు. గ్రీన్ బడ్జెట్ కింద రూ.2.32 కోట్లు కేటాయించారు.

పన్నుల వసూళ్లలో ఆదర్శంగా నిలవాలి

- పూజారి గౌతమి, అదనపు కలెక్టర్

మున్సిపాలిటీలో వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేసి ఆదర్శంగా నిలవాలని జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి సూచించారు. మార్చి 10 లోగానే పన్నుల వసూలు పూర్తి చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సిరిసిల్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బడ్జెట్ చక్కగా అర్థవంతమైందిగా రూపకల్పన చేశారని అభినందించారు. ఇంటి పన్నులతోపాటు మున్సిపల్‌కు వచ్చే వ్యాపార సముదాయాలు, ఇతర పన్నులను కూడా వసూలు చేయాలన్నారు. విలీన గ్రామాల అభివృద్ధి కోసం, మురికివాడలు, వెనకబడిన ప్రాంతాలకు అధిక నిధులు కేటాయించేలా దృష్టి పెట్టారన్నారు. హరితహారానికి నిధులు కేటాయించారని, పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ పన్నులు చెల్లించి సహకరించాలని అన్నారు.

అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని బడ్జెట్

- జిందం కళాచక్రపాణి మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్ల మున్సిపల్ బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించినందుకు కౌన్సిల్‌కు ప్రత్యేక ధన్యవాదాలని, సిరిసిల్ల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ రూపకల్పన చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. గత సంవత్సరం బడ్జెట్ రూ.78.99 కోట్లు ఆమోదించుకోగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.84.32 కోట్లు అంచనా బడ్జెట్‌ను ఆమోదించుకున్నాం. ముఖ్యంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, మంచినీటి అవసరాల నిర్వహణకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. మున్సిపల్ చట్టం ప్రకారం పది శాతం హరితహారానికి, మిగిలిన నిధులు విలీన గ్రామాల అభివృద్ధికి కేటాయించినట్లు పేర్కొన్నారు.

2024-25 అంచనా బడ్జెట్

ఆస్తిపన్ను	రూ.5.91 కోట్లు
అద్దెల ద్వారా ఆదాయం	రూ.2.30 కోట్లు
పారిశుధ్య విభాగం	రూ.60 లక్షలు
టౌన్ ప్లానింగ్	రూ.5.23 కోట్లు
ఇంజనీరింగ్ విభాగం	రూ.1.90 కోట్లు
ఇతర ఆదాయం	రూ.77.68 లక్షలు
డిపాజిట్లు, రుణాలు	రూ.90 లక్షలు
గ్రాంట్లు	
నాన్ ప్లానింగ్ గ్రాంట్లు	రూ.16.76 కోట్లు
ప్లానింగ్ గ్రాంట్లు	రూ.70 లక్షలు
ఇతర గ్రాంట్లు	రూ.49.22 కోట్లు
మొత్తం	**రూ.84.32 కోట్లు**

2023-24 అంచనా బడ్జెట్

ఆస్తిపన్ను	రూ.5.89 కోట్లు
అద్దెల ద్వారా ఆదాయం	రూ.2.99 కోట్లు
పారిశుధ్య విభాగం	రూ.90.25 లక్షలు
టౌన్ ప్లానింగ్	రూ.5.71 కోట్లు
ఇంజనీరింగ్ విభాగం	రూ.2.84 కోట్లు
ఇతర ఆదాయం	రూ.77.68 లక్షలు
డిపాజిట్లు, రుణాలు	రూ.1.05 కోట్లు
గ్రాంట్లు	
నాన్ ప్లానింగ్ గ్రాంట్లు	రూ.8.49 కోట్లు
ప్లానింగ్ గ్రాంట్లు	రూ.4.70 కోట్లు
ఇతర గ్రాంట్లు	రూ.45.63 కోట్లు
మొత్తం	**రూ.78.99 కోట్లు**

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సిరిసిల్లలో జిల్లా పోలీస్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7న సిరిసిల్ల, వేములవాడలో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్ సిరిసిల్ల, వేములవాడలో ఏర్పాట్లను పరిశీలించారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డులో ముఖ్యమంత్రి ప్రారంభించనున్న జిల్లా పోలీస్ కార్యాలయ భవనాన్ని, హెలీప్యాడ్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. చెట్ల పొదలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ లావణ్యను ఆదేశించారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన పనులపై జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంకు సూచనలు చేశారు. రెండో బైపాస్ రోడ్డులోని అపెరల్ పార్కులో పారిశ్రామిక వేత్తలకు కేటాయించే షెడ్లను పరిశీలించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ముఖ్యమంత్రి దర్శించుకున్న అనంతరం జరిగే సభ స్థలాన్ని పరిశీలించారు. రగుడు సమీపంలో తాటి వనం వద్ద గీత కార్మికులకు అందించే పరికరాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరీ, అగ్నిమాపక అధికారి వెంకన్న, డీఆర్‌డీవో శేషాద్రి, మైనింగ్ ఏడీ రఘుబాబు, డీఎస్పీలు నాగేంద్రచారి, భీం శర్మ, టెక్స్‌టైల్ ఏడీ సాగర్, డీటీసీపీవో అన్సారీ, వేములవాడ కమిషనర్ అన్వేష్ తదితరులు ఉన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఉమారాణి

ముస్తాబాద్, మార్చి 4 : జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో ఉమారాణి అన్నారు. సోమవారం మండలంలోని రాంరెడ్డిపల్లె, కొండాపూర్, చిప్పలపల్లి గ్రామాల్లో జడ్పీ నిధులతో చేపట్టిన పనులను సోమవారం జడ్పీ సీఈవో ఉమరాణి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరశర్మ, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ

తంగళ్లపల్లి, మార్చి 4: తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు జడ్పీటీసీ పుర్మాణి మంజుల లింగారెడ్డి భూమి పూజ చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో మండలంలోని నేరెళ్ల గ్రామంలో నీటి వసతికి డ్రిల్లింగ్ బోర్, సెట్‌కు, నూతన మహిళా భవన నిర్మాణానికి, జిల్లెల్ల గ్రామంలో ఆదర్శ రెడ్డి సంఘం భవన నిర్మాణ మిగులు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి, మార్చి 4 : తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్) ఆధ్వర్యంలో లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్‌లో గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు టైడ్స్ ప్రిన్సిపల్ రాఘవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన, ఎంప్లాయిమెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం మండపల్లి టైడ్స్‌లో 3 నెలల ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణకు హాజరయ్యే యువతకు టైడ్స్ లోనే ఉచిత వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఉచిత డ్రైవింగ్ శిక్షణకు ఈ నెల 16 నుంచి ప్రారంభం అవుతుందని, ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెంది, 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులని వివరించారు. అభ్యర్థి ఎత్తు 160 సెంటీమీటర్ల పైన ఉండాలని, దేశంలో ఎక్కడైనా ఉద్యోగం చేసేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు మూడు నెలలపాటు అప్రెంటిస్ ఉంటుందని పేర్కొన్నారు. ఎల్ హెచ్‌ఎం లైసెన్స్ ఏడాది పూర్తయిన వారికి హెచ్ ఎంవీ శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 10వ తరగతి సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, కులం, ఆదాయం, బ్యాంక్ ఖాతా జిరాక్స్ ప్రతులు, 6 ఫొటోలు తీసుకురావాలని సూచించారు. అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కేటీఆర్ పర్యటన

సిరిసిల్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కే తారకరామారావు మంగళవారం సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉదయం 11 గంటలకు ముస్తాబాద్‌లో మండల కార్యకర్తలతో సమావేశం కానున్నారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు తంగళ్లపల్లి మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరవుతారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న కరీంనగర్ జోనల్ ఈడీ వినోద్‌కుమార్

వేములవాడ టౌన్, మార్చి 4: వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ కరీంనగర్ జోనల్ ఈడీ వినోద్‌కుమార్ అన్నారు. వేములవాడ ఆర్టీసీ మేనేజర్ కార్యాలయంలో సోమవారం అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు అసౌకర్యాలకు గురికాకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. మరుగుదొడ్ల వసతి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రోజుకు 400 బస్సుల చొప్పున 15 డిపోల పరిధిలో నడపాలని ఆదేశించారు. ఈ సమావేశానికి నిర్మల్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ ఆర్టీసీ అధికారులు హాజరయ్యారు. ఆర్టీసీ అధికారులు భూపతిరెడ్డి, సత్యనారా యణ, యుగందర్‌రెడ్డి, మనోహర్, ఆంజనేయులు, మురళీకృష్ణ ఉన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

ఇల్లంతకుంట, మార్చి 4:మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని షీటీఎం ఏఎస్సై ప్రమీల అన్నారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని కేరళ మోడల్ పాఠశాలలో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులను ఎవరైన వేధిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీరాముల శ్రీధర్, పీసీలు ప్రియాంక, శ్రీధర్ పాల్గొన్నారు.

సెస్‌పై అవినీతి మరకలు లేకుండా చూసుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- సిరిసిల్లలో గృహజ్యోతి విద్యుత్ జీరో బిల్లు ప్రారంభం



జీరో బిల్లును అందజేస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘాన్ని విలీనం చేయాలని ఈఆర్‌సీ సిఫార్సు చేశారని, ఎంతో చరిత్ర కలిగిన సెస్‌ను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని, సెస్‌పై అవినీతి మరకలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత పాలకవర్గానిదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతిలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ జీరో బిల్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయంగా సిరిసిల్లలోని సుభాష్‌నగర్ లబ్ధిదారుల ఇళ్లలో జీరో బిల్లులను అందించారు. అనంతరం సెస్ ప్రధాన కార్యాలయంలో ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడారు. సెస్‌ను విలీనం చేసే సిఫార్సును నిలిపివేసే దిశగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కరెంట్ కట్ చేస్తే ఊరుకోబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారని, సెస్ వాళ్లు కూడా అకారణంగా కరెంట్ కట్ చేయవద్దని అన్నారు. పేదలల కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లే ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చి రెండు రోజుల్లోనే మహిళా తల్లులకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలమన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత కరెంట్ పైనే తొలి సంతకం చేసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఎళ్లవేళలా కృషి చేస్తోందన్నారు. గృహలక్ష్మీలో భాగంగా 200 యూనిట్ల వరకు విద్యుత్‌పై జీరో బిల్లు ఇస్తున్నామన్నారు.గతంలో యూపీఏ హయాంలో రూ.500 వరకు ఉన్నట్లుగానే సిలిండర్‌ను అదే ధరకు ప్రజలకు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఆర్టీసీ బస్సుల్లో జీరో టికెట్ మాదిరిగానే జీరో కరెంట్ బిల్లు ఇస్తున్నట్లే అర్హులైన వారికి ఆరు గ్యారంటీలను అందిస్తామని అన్నారు. జిల్లా అభివృద్ధిపై అపోహలు వద్దని, జిల్లా అభివృద్ధి ఎక్కడా ఆగదని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామన్నారు.

సీఎం పర్యటన అభివృద్ధికి తోడ్పాటు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7వ తేదీన సిరిసిల్లలో పర్యటించడం జిల్లా అభివృద్ధికి తోడ్పాడుతుందని శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికే జిల్లాకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలు వివరించామని అన్నారు. జిల్లాలోని నేత కార్మికుల సమస్యలు, పరిశ్రమలు, ఇతర అభివృద్ధికి సంబంధించినవి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాన్నారు. జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలు తమ దృష్టికి తీసుకొస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సెస్‌కు రావాల్సిన బకాయిలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సెస్ ఎండీ సూర్యచంద్రరావు, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, కౌన్సిలర్ దార్నం అరుణ, సెస్ డైరెక్టర్లు, దిడ్డి రమాదేవి, దార్నం లక్ష్మీనారాయణ, మల్లుగారి రవీందర్‌రెడ్డి, గౌరినేని నారాయణరావు, వరుస కృష్ణహరి, సందుపట్ల అంజిరెడ్డి, మాడుగుల మల్లేశం, పొన్నాల శ్రీనివాసరావు, ఆకుల గంగారాం, రేగులపాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజం, కొట్టెపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

నిరుపేద తల్లిదండ్రులకు అండగా కల్యాణలక్ష్మి

ఇల్లంతకుంట, మార్చి 4: నిరుపేద తల్లిదండ్రులు ఆడపిల్లల వివాహాలు చేయడానికి ఇబ్బందులు పడవద్దనే ప్రభుత్వం కల్యాణలక్ష్మి అందిస్తున్నట్లు ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన 45 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డలకు అండగా నిలవాలనే లక్ష్యంతో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చెక్కులను మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి, కాథ సుమలతమల్లేశం, డీటీ సత్యనారాయణ, ఆర్‌ఐ షఫీ పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో రద్దీగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం



ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు



క్యూలో బారులుదీరిన భక్తులు

వేములవాడ టౌన్, మార్చి 4 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సోమవారం భక్తులు పోటెత్తారు. సోమవారం తెల్లవారు జాము నుంచి క్యూలైన్‌లలో బారులుదీరిన భక్తులు ఆలోయంలోకి ప్రవేశించి పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

● మంత్రులకు ఆహ్వానం

వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతరకు రావాల్సిందిగా దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో వారిని కలిశారు. దేవదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు కూడా మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని పురుగుల మందు డబ్బాతో మాజీ సర్పంచ్ నిరసన



పురుగుల మందు డబ్బా లాక్కుంటున్న పోలీసు

తిమ్మాపూర్, మార్చి4: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కార్యాలయం ఎదుట మన్నెంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేడి అంజయ్య పెండింగ్ బిల్లులు చెల్లించాలని పురుగుల డబ్బాతో నిరసన తెలిపాడు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తిమ్మాపూర్ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుండగా మన్నెంపల్లి మాజీ సర్పంచ్ మేడి అంజయ్య పురుగుల మందు డబ్బాతో అక్కడికి వచ్చాడు. గమనించిన పోలీసులు పురుగుల మందు డబ్బా లాగేసుకుని అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరిగి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భార్య పుస్తెల తాడు కుదువపెట్టి, అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. దానితోనే కేంద్ర, రాష్ట్ర అవార్డులు తిమ్మాపూర్ మండలానికి వచ్చాయని అన్నారు. సొంత నిధులు ఖర్చుపెట్టి గ్రామాలను అభివృద్ధి చేస్తే ఇప్పటికీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరాడు. కొందరు మాజీ సర్పంచ్‌లు బిల్లులపై నిరసన తెలిపేందుకు వచ్చే అవకాశం ఉందని ముందస్తుగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాళేశ్వరం ఆలయ ఇన్‌చార్జి ఈవోగా ఎండపెల్లి మారుతి



ఎండపెల్లి మారుతి

కరీంనగర్ కల్చరల్, మార్చి 4: ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రసిద్ధ శైవక్షేత్రం కాళేశ్వర దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా ఎండపెల్లి మారుతికి బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. మారుతి కరీంనగర్ సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయంతో పాటు మరో రెండు ఆలయాలకు ఈవోగా ఉన్నారు. కాళేశ్వరం ఈవోగా ఉన్న మహేశ్ మార్చి 13 వరకు 15 రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో పాటు శివరాత్రి జాతర సమీపిస్తుండటంతో ఈ తాత్కాలిక నియామకం చేపట్టారు.

అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్

» అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం చేసింది. బోర్డు ఛైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, విశ్రాంత హైకోర్టు జడ్జి వామన్‌రావు ఇతర అధికారులు సచివాలయంలో సోమవారం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు ఈ సమావేశంలో కొలిక్కి వచ్చాయి. ప్రధానంగా, దేవాదాయశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానం చేశారు. అయితే, ఒకేసారి అందరికి కాకుండా దశల వారిగా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. మొదటి విడతలో రూ.50 వేలలోపు వేతనం ఉన్నవారికి, అనంతరం పలు దఫాల్లో మిగతా వారికి హెల్త్ ఇన్సురెన్స్ కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల నుంచి అర్చక, ఉద్యోగుల సమాచార సేకరణ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారుల్ని కోరారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు: కిషన్ రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి అసలు భవిష్యత్తే లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసీల గడ్డగా పేరుందని, ఈ ప్రాంతంలో కొమురంభీం, రాంజీ గోండు స్ఫూర్తిగా ఎన్నో పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు కూడా భవిష్యత్ లేదని ఆయన అన్నారు.

గతేడాది యాసంగి సీఎంఆర్ గడువు పెంపు

» మే 15 తేదీ వరకు అవకాశం కల్పించిన కేంద్రం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23) యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును రానున్న మే నెల 15 తేదీ వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీఎంఆర్ గడువు పెంచాలని గత ఫిబ్రవరి నెల 23 తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొని ఈ ఉత్తర్వులు ఇచ్చింది. బియ్యం రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వారీగా లిఖితపూర్వకంగా షెడ్యూలు తీసుకొని, ఎఫ్‌సీఐకి డెలివరీ చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి తీసుకోవాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. వివిధ జిల్లాల మేనేజర్లు, డీఎస్‌వోలకు సోమవారం సర్క్యులర్ జారీచేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ఇటీవల టెండర్లు పిలిచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మినహాయించి.. మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

5-6 నెలల తర్వాత..

ఈ సర్కారుండదు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నేతలతో పలు అంశాలపై చర్చించారు. సిటింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావుకు ఖమ్మం, మహబూబాబాద్‌లో మాలోతు కవితకు మరోసారి పోటీకి అవకాశం ఇవ్వాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డిని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వారిపై ఉండే వ్యతిరేకతను బీఆర్ఎస్‌కు అనుకూలంగా మార్చుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేద్దామని పార్టీ శ్రేణులతో అన్నారు. బీఆర్ఎస్‌ను వీడుతున్న వారివల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండబోదని.. అలాంటి పరిణామాలను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం.. ఖమ్మంలోనూ బహిరంగ సభ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓడిపోయినా.. అధైర్యపడాల్సిన పనిలేదని, నాయకులు ధైర్యంతో ముందడుగు వేయాలని సలహా ఇచ్చారు. పార్టీని పటిష్ఠం చేసుకోవడంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ముగ్గురితో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "బీఆర్ఎస్ పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజలకు చేయాల్సింది చేశాం. అయినప్పటికీ.. వారు మనకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు. మన విలువ ప్రజలకు తొందరలోనే తెలుస్తుంది" అన్నారు. రాష్ట్రంలో రైతు బంధు, దళితబంధు వంటి పథకాలు ఎన్నికల కోసం తేలేదని, ఒక విజన్‌తో తెచ్చానని కేసీఆర్ చెప్పారు.

నలుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

రెండు రోజుల సమీక్షల అనంతరం కేసీఆర్ తమ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు.



తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

ఎన్టీఆర్‌లాంటి నేతకే తప్పలేదు..

"రాజకీయాల్లో గెలుపోటములు సహజమే. ఎన్టీఆర్ లాంటి నేతకే ఒడుదొడుకులు తప్పలేదు.. ఆయన ముందు మనమెంత?" అని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పాతాళానికి పడిపోయి కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. "అప్పట్లో టీడీపీ మన పార్టీ కంటే దారుణంగా ఓటమి చవిచూసింది. అయినప్పటికీ.. తప్పులను సరిదిద్దుకొని తిరిగి చేజిక్కించుకుంది" అని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓడిపోవడం కూడా మంచిదే.. గుర్రం ఏదో.. గాడిదేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ప్రజలకు వచ్చింద"ని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ సమీక్షా సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరు కాలేదు. వెంకటరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంఛనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్

అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని.. అసంపూర్తిగా అమలుచేసిన రెండు, మూడు హామీలు చూపించి అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని.. రాష్ట్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ నేతలతో మాజీ మంత్రి టి.హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమీక్ష అనంతరం తెలంగాణ భవన్‌లో ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలతో హరీశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా, తెలంగాణ సమస్యలు ఢిల్లీ వేదికగా ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలన్నారు. కాగా.. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీనే కాక ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటామని.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారన్నారు.



సిరిసిల్ల జిల్లా నారాయణపూర్‌లో జరిగే రేణుకామాత జమదగ్ని కల్యాణానికి రావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నేతలు

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పోరుబాట

» 6న నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నాలు

» 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పోరు బాటకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను తమపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాలవద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ బాధితులను కలుపుకొని ఈ ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా 33 జిల్లాల పరిధిలో ఈనెల 7న జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాలని చెబితే రక్తమాంసాలు పీలుస్తున్నామని నాడు విమర్శించారన్నారు. గతంలో తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోర్టుకు వెళ్లారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేస్తామని గతంలో భట్టివిక్రమార్క చెప్పారని, నో ఎల్ఆర్ఎస్.. నో టీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. అదేవిధంగా ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని, జనం సొమ్ము దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్కకూడా అన్నారని పేర్కొన్నారు. ప్రజలపై ఆర్థికభారం మోపడానికి రంగం సిద్ధం చేశారని, రాష్ట్ర ప్రజల ద్వారా రూ.20వేల కోట్లు రాబట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

ఉమ్మడి పాలమూరు నేతలతో కేటీఆర్ భేటీ

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

బయట పడిన చీకటి ఒప్పందం

» సభలో బీజేపీ, కాంగ్రెస్‌ల నైజం వెల్లడి

» చెవిలో పూలు పెట్టిన మోదీ, రేవంత్

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సాయం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని, ఆదిలాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అలై బలై తీసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ వద్ద మోకరిల్లడాన్ని.. యావత్ తెలంగాణ చూసిందని, వారిద్దరి మధ్య ఉండే బడే భాయ్.. చోటే భాయ్ బంధం ప్రజల ముందే బహిర్గతమైందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల మధ్య అవగాహన కుదిరిందని, ఉత్తర తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ సహాయం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చెవిలో రేవంత్‌రెడ్డి కాలీఫ్లవర్ పెడితే.. మోదీ కమలం పువ్వు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి రుణం అడిగితే.. కేంద్రం ఇబ్బంది పెట్టిందని.. అదే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తీసుకోవడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఒక్క మాట కూడా అనరని, మాజీ సీఎం కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ.. అదానీ బంధంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే.. రేవంత్ మాత్రం అదానీతో ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో ఎవరిని నమ్మాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి నిలదీశారు.

ఓఆర్ఆర్ లీజు బేస్ ప్రైస్ రూ.7300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించడంపై నిరుడు ఏప్రిల్ 28న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికతో ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించారు. సీఎం కాగానే దీనిపై హెచ్ఎండీఏ అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదిక కోరారు. టెండర్లు ఆహ్వానించినప్పుడు బేస్‌ప్రైస్‌ను ప్రభుత్వం ప్రకటించక పోయినప్పటికీ.. టెండర్ వేసిన నాలుగు సంస్థల్లో ఐఆర్‌బీ సంస్థ రూ.7272 కోట్లు, దినేష్‌చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రా రూ.7007 కోట్లు, గవర్ కన్‌స్ట్రక్షన్ రూ.6767 కోట్లు, ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా రూ.5643 కోట్ల మేర బిడ్‌లను కోట్ చేశాయి. అత్యధికంగా కోట్ చేసిన ఐఆర్‌బీ సంస్థను.. 'మరింత అధికంగా చెల్లిస్తారా?' అని ప్రభుత్వ వర్గాలు కోరగా రూ.7380 కోట్లు చెల్లించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓఆర్ఆర్‌పై ఏటా పెరిగే వాహనాలు, 3 నుంచి 4 శాతం మేర పెరిగే టోల్ చార్జీలతో ఏడాదికి కనీసం ఐదు శాతం ఆదాయం పెరిగినా సర్కారుకు భారీగా ఆదాయం పెరుగుతుంది. అయినా.. 30 ఏళ్ల లీజుకు బేస్‌ప్రైస్‌ను రూ.7300 కోట్లుగా నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఓఆర్ఆర్ టీవోటీ ఫైనాన్షియల్ బిడ్‌ల ఇనిషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూను (ఐఈసీవీ) నిర్ధారించడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీయే రూ.7380 కోట్ల లీజు చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థను ఒప్పించినట్లు తెలిసింది. ఈ మేరకు.. గత ఏడాది ఆగస్టు 12 అర్ధరాత్రి నుంచి ఓఆర్ఆర్ ప్రైవేటు సంస్థ లీజులోకి వెళ్లగా, 11వ తేదీనే ప్రభుత్వానికి రూ.7380 కోట్ల చెక్కు అందింది. దాన్ని హెచ్ఎండీఏ ఖాతాలో 12న జమ చేయగా, మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు మళ్లించారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వాడతామని.. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ, ఆ సొమ్మును రైతు రుణమాఫీకి వినియోగించినట్లు సమాచారం.

రహదారులు రక్తసిక్తం!

» రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం

కొత్తకోట, సదాశివపేట, పటాన్ చెరు, బోయినపల్లి, మార్చి 4: రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమయ్యాయి! వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం చెందారు. నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబసభ్యుల కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని వారిలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణం బసవన్నకుంటకు చెందిన సలీమాబీ మనవడు అలీకి హైదరాబాద్‌లోని ఓ కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయమైంది. సోమవారం హైదరాబాద్‌లో నిశ్చితార్థం ఉన్నందున సలీమా బీ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఎర్టిగా కారులో బళ్లారి నుంచి బయలుదేరారు. అలీ డ్రైవింగ్ చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కొత్తకోట సమీపంలోని బైపాస్ రోడ్డులో వారి కారు జాతీయ రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. దీంతో ఘటనా స్థలంలోనే అబ్దుల్ రెహమాన్ (39), రుమానా (2), సలీమా బీ (95), రోషిణి (4), హసిఫా రిఫాత్ (7 నెలలు) మృతి చెందారు. అలీ, షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నదెబ్బ కూడా తగలకుండా సమీరా (8) బయటపడింది.

ఇదిలా ఉండగా.. బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ దుర్మరణంపాలైన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన దంపతులు ఏనుగు జనార్దన్ రెడ్డి(49), ఏనుగు ప్రతిభ (42) మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్కూటీపై బయలుదేరారు. పద్మాజీవాడి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి వారిద్దరూ కింద పడ్డారు. ప్రతిభపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్ కాలుపై నుంచి కూడా వాహనం వెళ్లడంతో కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. అతన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) అనే భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇదిలా ఉండగా..రోడ్డు పక్కన పార్క్ చేసివున్న బొలేరో వాహనాన్ని షేక్ మహ్మద్ హుస్సేన్ (14) అనే విద్యార్థి నడుపుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఘటనలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వెనుక కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.



వనపర్తి జిల్లా ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఔటర్‌పై కారు ఢీకొని.. ఆర్మీ జవాన్ దుర్మరణం

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి ఎయిర్‌పోర్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాను మృతిచెందాడు. నార్సింగ్ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. ప్రమాదం అనంతరం వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మృతుడు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, అయన పేరు కులాన్ అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే కులాన్‌ను ఓ రెడీ మిక్సర్ వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఘటన తర్వాత కులాన్ మృతదేహం చాలా సేపటి దాకా అక్కడే ఉందని, వాహనదారుల్లో ఎవ్వరూ పట్టించుకోలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. మరి.. కులాన్ ఔటర్ రింగ్ రోడ్డువైపుకు ఎందుకు ఎక్కాడు? ఎక్కడికి వెళుతున్నాడు? అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పాదచారులకు ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశం ఉండదు. కొంతమంది ఎయిర్ పోర్టుకు గానీ, గచ్చిబౌలికి గానీ వెళ్లాలన్నా ఔటర్ రింగ్‌రోడ్డుపైకి ఎక్కి షేరింగ్ ట్యాక్సీలను ఆపి ఎక్కడం లేదా లిఫ్ట్ అడిగి ఎక్కడం చేస్తుంటారు. ఆ రకంగా ఇతను ఎక్కడకైనా వెళ్లేందుకు వచ్చాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం అక్రమాలపై న్యాయవిచారణ

» కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్3(1) ప్రకారం ఆదేశిస్తాం

» సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఎంక్వైరీ

» మా విజ్ఞప్తి మేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్ఏ కమిటీ

» హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

» కాంగ్రెస్ నేత నిరంజన్ పిటిషన్ నాలుగు నెలలకు వాయిదా

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలపై న్యాయవిచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు లిఖిత పూర్వకంగా తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 సెక్షన్ 3 (1) అధికారాలను ఉపయోగించుకుని విచారణకు ఆదేశిస్తామని నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలన్న హైకోర్టు గత ఆదేశాల మేరకు.. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ వాదనను ధర్మాసనానికి తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి.. ప్రాథమిక విచారణ చేపట్టిందని.. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుకు కారణాలు వివరిస్తూ గత నవంబర్ 1న ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని అథారిటీ తన లేఖలో సూచించిందని ఏజీ పేర్కొన్నారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక దర్యాప్తును పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. సదరు ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంది. ఈఎన్సీ (ఐ) రామగుండం ఎన్.వెంకటేశ్వర్లు సర్వీసును టెర్మినేట్ చేశాం. దాంతోపాటు ఈఎన్సీ (జనరల్)ని రాజీనామా చేయాల్సిందిగా కోరాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం." అని వివరించారు. అలాగే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలంటూ ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్ఏకి లేఖ రాసిందని.. ఈమేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్ఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 1న ఆదేశాలిచ్చిందని వెల్లడించారు. బరాజ్‌ల దుస్థితికి కారణాలు.. పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

ఒకటో తేదీన వేతనాల చెల్లింపు హర్షణీయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 4: ఉద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలను చెల్లించడం హర్షణీయమని నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం జీతాలను సక్రమంగా ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1వ తేదీన వేతనాలను ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యదర్శి జీవన్, కోశాధికారి వెంకట సత్యం తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

రుద్రంగి, మార్చి 4 : పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని కేరళ హై స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, బాబు నంబియార్, తొట్ల అంజయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రాజీనామాను ధ్రువీకరించిన జడ్పీ సీఈవో

వేములవాడ టౌన్, మార్చి 4 : వేములవాడ మండల పరిషత్ ఉపాధ్యక్ష పదివికి రేగులపాటి ఆర్సీరావు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వ్యక్తిగత కారణాల చేత ఆర్సీరావు వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తూ లేఖను సంబంధిత అధికారులకు అందజేశారు. దీంతో రాజీనామా లేఖను పరిశీలించిన జడ్పీసీఈవో రాజీనమాను ఆమోదించి వేములవాడ వైస్ ఎంపీపీ పదవి ఖాళీగా ఉన్నట్లు ప్రకటించారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

రుద్రంగి మార్చి 4: మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న బుగ్గరాజ రాజేశ్వర స్వామి జాతరకు, ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి కోరారు. రుద్రంగి మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో బుగ్గ రాజరాజేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా వేద పండితులు శ్రీనివాసచార్యులు కల్యాణం, జాతరకు సంబంధించిన తేదీలను ఖరారు చేసి కల్యాణ పత్రికను పెట్టారు. ఈనెల 8న స్వామివారి కల్యాణం, 9న జాతర, అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తర్రె ప్రబలత మనోహర్, ఎర్రం గంగ నరసయ్య, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, సామ మోహన్ రెడ్డి, పిడుగు లచ్చిరెడ్డి, పులి లక్ష్మీరాజం, మంచే రమేష్, హీరోజి పాల్గొన్నారు

పెద్ద చెరువు తూమును తెరిచిన గుర్తు తెలియని వ్యక్తులు

ముస్తాబాద్, మార్చి 4: ముస్తాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు తూంను గుర్తు తెలియని వ్యక్తులు తెరవడంతో పెద్దఎత్తున ఎల్లమ్మ వాగుకు నీళ్లు చేరాయి. సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈఈ రవికుమార్ ఘటన స్థలానికి చేరుకున్నారు. తూంను మూసి నీరు నిల్వ ఉండేలా చూస్తామన్నారు. తూం ద్వారా నీటిని పంపవద్దని ముస్తాబాద్ రైతులు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా శంకర్

ఇల్లంతకుంట, మార్చి 4: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కాసుపాక శంకర్‌మాదిగ ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో సోమవారం జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా పసుల బాబు, కొలపురి కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా సావనపెల్లి రాకేష్, కోశాధికారిగా దమ్మని మధు, సహాయకార్యదర్శిగా సావనపల్లి మల్లేశం, సలహాదారులుగా పసుల నరేష్‌కుమార్, మంద లింగయ్య ఎన్నికయ్యారు, ఈ నెల 8న కరీంనగర్‌లో జరిగే పార్లమెంట్ నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, సీనియర్ నాయకులు లకపాక శంకర్, తడకపెల్లి భూమయ్య, జుట్టు వినోద్, ఎల్లయ్య, హన్మంతు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

రేణుకాదేవి ఆలయ అభివృద్ధికి విరాళం

ఇల్లంతకుంట, మార్చి 4: మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని రేణుకాదేవి ఆలయ అభివృద్ధికి పెద్దలింగాపూర్ మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ సోమవారం విరాళం అందజేశారు. గ్రామంలో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించి విరాళాలు సేకరిస్తున్నారు. విషయం తెలుసుకున్న జితేందర్‌గౌడ్ రూ. 10,116 అందజేశారు. కార్యక్రమంలో నాయిని రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ఇల్లంతకుంట, మార్చి 4: విద్యుదాఘాతంతో మృతిచెందిన జంగమరెడ్డిపల్లెకు చెందిన రంగు రమేష్ కుటుంబాన్ని సెస్ ఆదుకోవాలని మండల గీతకార్మిక సంఘం కన్వీనర్ గజ్జల రాజశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.20లక్షల పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి సంస్థలో ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండ వెంకటేశం, కొయ్యడ భాస్కర్, కొయ్యడ రాజయ్య, అంతటి రాజయ్య, బుర్ర సూర్యగౌడ్, వెంటేశం, శ్రీనివాస్, నాయిని తిరుపతి, సాయగౌడ్, లక్ష్మన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి అనుమతి ఇవ్వవద్దని నిరసన

చందుర్తి, మార్చి 4 : ఇంటి నిర్మాణం పేరిట చర్చి నిర్మాణానికి అనుమతి ఇవ్వవద్దని మండలంలోని తిమ్మాపూర్ గ్రామస్థులు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్చి నిర్మాణానికి అనుమతి వద్దని గతంలో గ్రామసభలో తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 4: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సోమవారం చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమపై ఆధారపడి పని చేస్తున్న అందరికీ వెంటనే ఉపాధిని కల్పించే విధంగా బతుకమ్మ చీరలతోపాటు ఇతర ప్రభుత్వ వస్త్రాల ఆర్డర్‌లను అందించాలన్నారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ చీరలకు సంబంధించి 2018 సంవత్సరం 58 మంది కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీతోపాటు పెండింగ్ సబ్సిడీ అందించాలన్నారు. 2022-23 సంవత్సరాల పెండింగ్ సబ్సిడీ డబ్బులను అందించాలని, త్రిఫ్ట్ పథకానికి సంబంధించిన ఆర్‌డీ-2 డబ్బులను విడుదల చేయాలని కోరారు. యాజమానులకు రావాల్సిన బకాయిలను చెల్లిచాలని, టెక్స్‌టైల్ పార్క్‌లో మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని కోరారు.

కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, మార్చి 4: మంత్రి పొన్నం ప్రభాకర్ ఆత్మీయ సన్మానం కార్యక్రమాన్ని విజయవంతం చేయలని గౌడ కులాల ఐక్య వేదిక జిల్లా కో ఆర్డినేటర్ గుగ్గిళ్ల జగన్ గౌడ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో ఐక్య వేదిక నాయకులు గౌడ సోదరుల ఆత్మీయ సన్మానం కరపత్రంను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10న సిరిసిల్ల పట్టణం కరీంనగర్ బైపాస్ రోడ్డు రీ కన్వెన్షన్ హాల్లో గౌడ్ కుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గోపా పట్టణ అధ్యక్షుడుడు నాగుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కొండ రమేష్, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 4 : నాలుగు నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందిన తోటి మిత్రుడు బూరుగుపల్లి నరేందర్ కుటుంబానికి చేయూతనందించేందుకు పదోతరగతి మిత్రులు ముందుకొచ్చారు. నిరుపేద మిత్రుని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఉత్తం ఆంజనేయులు రూ. 5వేలు, గొడుగు రవి రూ. 5 వేలు, బత్తిని శ్రీధర్ రూ.3 వేలు, కంచర్ల తిరుపతి రూ.3 వేలు, బొడ్డు పరశురాములు రూ.2 వేలు, దానవేని పర్శరాములు రూ.2 వేలు అందజేశారు.

శివపార్వతుల శోభాయాత్ర

కథలాపూర్, మార్చి 4 : మండల కేంద్రంలో సోమవారం శివపార్వతుల శోభాయాత్ర వైభవం గా జరిగింది. బస్టాండ్ నుంచి శ్రీవేంకటేశ్వర స్వా మి ఆలయం దాకా ట్రాక్టర్‌లో స్వామివారిని సతీసమేతంగా ఊరేగించారు. అర్చకులు ప్రమోద్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు మం గళహారతులతో ఆహ్వానం పలికారు. ఊరేగింపులో స్వాములు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శివస్వాములు, మొలిగె శ్రీనివాస్, చిలువేరి రమేశ్ ఉన్నారు.

వేములవాడ అభివృద్ధిని విస్మరించిన కేసీఆర్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, మార్చి 4: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ అమలు చేయలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదం, పార్టీ కార్యకర్తల కృషితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి ప్రజలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని తీసుకెళ్తున్నారన్నారు. ఈ నెల 7న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాశివరాత్రి సందర్భంగా రాజన్నకు పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు చెప్పారు. వేములవాడకు సంబంధించిన కొన్ని అంశాలను ముఖ్యమంత్రి కార్యాలయంలో నివేదించామని, వాటి రూపకల్పన జరుగుతోందని అన్నారు. గతంలో వేములవాడ రాజన్నను దర్శించుకున్న కేసీఆర్ దేవాలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు విడదల చేస్తానని, మిడ్ మానేరు ముంపు గ్రామస్థులకు రూ. 5లక్షల 4వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు అమలు చేయాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తరపున అనేక పోరాటాలు చేశామన్నారు. ఇప్పుడు వేములవాడ శాసనసభ్యుడిగా ఎన్నికయ్యాక సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎగువమానేరుపై చర్చించినట్లు చెప్పారు. రూ.900 కోట్లు మంజూరవుతాయని, మల్కపేట రిజర్వాయర్ నుంచి ఎగువ మానేరుకు వెళ్లే పిల్లకాలువల పనులు ప్రారంభమవుతాయని అన్నారు. సిరిసిల్ల నేతన్నలకు సంబంధించిన అంశంపై కూడా చర్చించినట్లు చెప్పారు. కార్మికులు, ఆసాములు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 7న సీఎంగా రేవంత్‌రెడ్డి మొట్ట మొదటిసారిగా జిల్లాకు వస్తున్నారని, ఘన స్వాగతం పలకాలని అన్నారు. సమావేశంలో టీపీసీసీ చీఫ్ అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల, వేములవాడ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, వెంకటస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్మల స్వరూప, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, పట్టణ ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు, బీసీ, యుజన, చేనేత, ఎన్ఎస్‌యూసీ, మైనార్టీ సెల్ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మరమగ్గాల కార్మికులతో సీఎం సమావేశం నిర్వహించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 4 : సిరిసిల్ల పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరమగ్గాల కార్మికులతో సమావేశాన్ని నిర్వహించాలని, శాశ్వత ఉపాధి పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 7న సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల సంక్షోభం నివారణ కోసం కార్మికులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించాలన్నారు. మూడు నెలలుగా యజమానులు పరిశ్రమలను మూసి వేయడంతో ఆ వస్త్ర పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్న మరమగ్గాల కార్మికులతోపాటు అనుబంధరంగాల కార్మికులు, ఆసాములు, వార్పిన్, వైపని, గుమాస్తా, జాపరులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్ ఇవ్వడంతోపాటు పెండింగ్‌లో ఉన్న బతుకమ్మ చీరల బకాయిలు, కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ విడుదల చేయాలన్నారు. వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నక్క దేవదాస్, సిరిమల్లె సత్యం, గుండు రమేష్, ఒగ్గు గణేష్, సబ్బని చంద్రకాంత్,కంది మల్లేశం, బింగి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న మూషం రమేష్

న్యాయం చేయకపోతే లోక్ సభ ఎన్నిల్లో పోటీ

సిరిసిల్ల టౌన్, మార్చి 4 : నేరెళ్ల బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే కరీంనగర్ లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తామని బహుజన స్టూడెంట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సద్దాం అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరు సమావేశంలో మాట్లాడారు. నేరెళ్ల సంఘటనపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయని పక్షంలో రానున్న లోక్ సభ ఎన్నికల్లో గత ప్రభుత్వం అధికారంలో ఉండగా జరిగిన మూడు ఘటనలను మేనిఫెస్టోలో పెట్టి కరీంనగర్ లోక్ సభ ఎన్నికలో పోటీ చేస్తామన్నారు. సాంఘీక మాధ్యమాలలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పద్మశాలీలను పరుష పదజాలంతో దూషించడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వం బతుకమ్మ చీరలకు ఆర్డర్ ఇచ్చి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. సమావేశంలో బహుజన స్టూడెంట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మపెల్లి రాజకుమార్, నాయకులు మరటి దినేష్, బట్టి భరత్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

మానేరువాగులోకి ట్రాక్టర్లు దిగకుండా గేట్‌కు తాళం

ముస్తాబాద్, మార్చి 4 :మండలంలోని ఆవునూర్ మానేరు వాగులోకి అనుమతులతో ఇసుక నడిపేట్రాక్టర్లు దిగకుండా గుర్తు తెలియని వ్యక్తులు గేట్‌కు తాళం వేశారు. ముస్తాబాద్ మండల వాప్తంగా ఇంటి నిర్మాణం కోసం, ప్రభుత్వ పనుల కోసం ఇసుక ట్రాక్టర్ టోకెన్‌లును తహసీల్దార్ కార్యాలయంలో అందిస్తారు. చలాన్ కట్టాక టోకెన్‌లు తీసుకున్న ఇసుక ట్రాక్టర్ యజమానులు ప్రభుత్వ అనుమతి ఉన్న ఆవునూర్ మానేరు వాగులో 10 గంటల నుంచి సాయంత్రం వరకు టోకెన్‌ల చొప్పున నడిపిస్తారు. సోమవారం టోకెన్‌లకు అనుమతి ఉన్న వాగులోకి ఎవరు వెళ్లొద్దని గుర్తు తెలియని వ్యక్తులు కమాన్ కింద ఉన్న గేట్‌కు తాళం వేశారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ శ్యాంకుమార్ చేరుకొని తాళం తీసేలా చేశారు.

పోక్సో కేసులో ఒకరికి పదేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, మార్చి 4:బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌కు చెందిన ఎనగందుల వెంకటికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... నిజామాబాద్ గ్రామానికి చెందిన ఎనగందుల వెంకటి అదే గ్రామానికి చెందిన బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు కుటుంబసభ్యులు కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వెంకటిని రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ రమేశ్‌నాయక్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ మేరకు సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, శ్రావన్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మోహన్, లతీఫ్, నరేందర్ 16మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పీపీ పెంట శ్రీనివాస్ కేసు వాదించగా పూర్వపరాలను పరిశీలించారు. జిల్లా జడ్జి ప్రేమలత నిందితుడికి 10ఏళ్ల కఠిన కారాగారా శిక్షతోపాటు రూ. 10వేల జరిమానా విధించారని కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

మహిళలు సాధించ లేనిదేదీ లేదు



కమిషనర్ లావణ్యను సన్మానిస్తున్న చైర్ పర్సన్, మహిళలు

సిరిసిల్ల టౌన్, మార్చి 4: మహిళలు అనుకుంటే సాధించ లేనిది ఏదీ లేదని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సోమవారం సిరిసిల్ల మున్సిపల్ మెప్మా ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో ముందస్తుగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ కళాచక్రపాణి మాట్లాడారు. అన్ని రంగాలలో మహిళలు ముందు వరసలో ఉంటున్నారని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ లావణ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, ఆర్పీలు పాల్గొన్నారు.

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 4 : జీవో 317తో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని వారికి న్యాయం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ కోరారు. జీవో 317 సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉప సంఘంలో సభ్యుడిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నియమించడంతో సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ కార్వర్స్‌లో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీవో 317 ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు. మంత్రి స్పందించారని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, బండ నాంపెల్లి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

పోతుగల్ పాఠశాలలో మాక్ పోలింగ్

ముస్తాబాద్, మార్చి 4: మండలంలోని పోతుగల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రాధకిషన్‌రావు ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేష్మాసుల్తానా, భూపతి, చల్ల రాజిరెడ్డి, కృష్ణమాచారి అలీమోద్దీన్, రమేశ్, పర్శరాములు, భిక్షపతి, భారతి తదితరులు పాల్గొన్నారు.



ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న హెచ్ఎం

దాచారం పాఠశాలలో..

ఇల్లంతకుంట: ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో మండలంలోని దాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల కమిషనర్‌గా ఉపాధ్యాయుడు ఐరెడ్డి ప్రదీప్‌రెడ్డి వ్యవహరించారు. నామినేషన్లు స్వీకరించడం, పోలింగ్, ఓట్ల లెక్కింపు వంటివి చేపట్టారు.

పద్మశాలీలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

- సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 4: సిరిసిల్ల నేత కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సిరిసిల్ల నేతన్న విగ్రహం వద్ద ముక్కు నేలకు రాసి పద్మశాలీలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో పద్మశాలి సమాజం అంతా జేఏసీగా ఏర్పడి సిరిసిల్లకు రాకుండా అడ్డుకుంటామని సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం పద్మశాలి సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. దేశంలో రెండు ప్రధాన వృత్తుల్లో మొదటిది వ్యవసాయ రంగం, రెండోది వస్త్ర పరిశ్రమ రంగం అన్నారు. సిరిసిల్ల పట్టణంలో వస్త్ర పరిశ్రమకు చెందిన వృత్తిలో దాదాపు 80 శాతం మంది ఆధారపడి ఉన్నారు. గత ప్రభుత్వాలు, మొన్నటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల నేత కార్మికులను ఏవిధంగా ఆదుకోవాలి, చేయుతనివ్వాలో ఆలోచన చేసి కార్యచరణ చేపట్టాయన్నారు. కాంగ్రెస్‌కు చెందిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా సిరిసిల్లకు వచ్చి కార్మికులకు చేయుతను అందిస్తే ఆదే కాంగ్రెస్ పార్టీకి చెందిన కేకే మహేందర్‌రెడ్డి సిరిసిల్ల నేత కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. మూడు నెలలుగా బతుకమ్మ చీరల ఆర్డర్లు రాకపోవడం, పవర్‌లూమ్స్ బంద్ కావడంతో వృత్తిని నడపలేక ఆసామి తేళ్ల సత్యం పాపడాలు, నిత్యావసరాలు విక్రయిస్తున్న దృశ్యాలను సోషల్ మీడియా విలేకరి సాంఘీక మాధ్యమాలో షేర్ చేస్తే మహేందర్‌రెడ్డి పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. ఉపాధి లేక ఇతర వ్యాపారాల వైపు వెళ్లడం మీకు నచ్చడం లేదా గతంలో మాదిరిగా ఉరివేసుకొని సిరిసిల్లను ఉరిశాలగా చేయాలని ఆలోచన ఉందా? అని ప్రశ్నించారు. బతుకమ్మ చీరలతో ఆరు సంవత్సరాలుగా దొబ్బితిన్నది చాలదా అన్న కేకే మహేందర్‌రెడ్డి తన ఇంట్లో నుంచి తీసుకొచ్చి కార్మికులకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. అధికారం వచ్చిందని ఇష్టారాజ్యాంగా మాట్లాడితే ఇక్కడ ఎవరూ సహించబోరన్నారు బహిరంగంగా కేకే మహేందర్‌రెడ్డి సిరిసిల్ల నేతన్న విగ్రహం వద్ద ముక్కు నేలకు రాసి క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పద్మశాలి సమాజం అంతా జేఏసీగా ఏర్పడి ప్రశ్నిస్తామన్నారు. ఈ నెల 7న జిల్లాలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలన్నారు. ఎన్నికల్లో సిరిసిల్ల ప్రజలు ఓట్లు వేయకపోతే కడుపులో ఇంత కుట్ర పెట్టుకొని కక్ష సాధింపులతో ధృతరాష్ట్ర ప్రేమను చూపిస్తున్నట్లు ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఈ సమావేశంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, సిరిసిల్ల యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్, సిరిసిల్ల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు మోర రవి, గాజుల బాలయ్య సహాయ కార్యదర్శి రాపెల్లి ప్రవీన్‌కుమార్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, పద్మశాలి సంఘం నాయకులు బొల్లి రామ్మోహన్, ఆడెపు రవీందర్, నాగుల శ్రీనివాస్, దార్ల సందీప్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం నాయకులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గంభీరావుపేట, మార్చి 4: గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ లక్ష్మీ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఇలాంటి ప్రజాస్వామ్యంలో అనేక కులాలు మతాలు ఉన్నప్పటికీ వీటన్నిటిని ఏకతాటిపై తీసుకొచ్చింది ఓటేనన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రజక సంఘం నాయకులు

చందుర్తి, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు మండల రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తొలి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పైన ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షులు సుద్దాల నర్సయ్య, ఎంపీటీసీ పులి రేణుక-సత్తయ్య, రజక సంఘం నాయకులు లింగంపల్లి రాములు, సతీష్, కొడగంటి గంగాధర్, లింగంపల్లి దేవయ్య, లింగంపల్లి వెంకట్, లింగంపల్లి తిరుపతి, లింగంపల్లి రాములు, లింగంపల్లి లచ్చయ్య నరసయ్య, లింగంపల్లి మల్లయ్య, లక్ష్మీరాజం, రాజయ్య, సుద్దాల రామచంద్రం, పొలాస ప్రమోద్, కొడగంటి దేవయ్య పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన దుప్పి

కోనరావుపేట, మార్చి 4: అటవీ ప్రాంతంలో నీరు లేకపోవడంతో నీటి కోసం వచ్చిన చుక్కల దుప్పి ప్రమాదవశాత్తు బావిలో పడింది. కోనరావుపేట మండలం మరిమడ్ల అటవీ ప్రాంతం నుంచి తాగు నీటి కోసం వచ్చిన దుప్పి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడిపోయింది. గమనించిన గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ అధికారులు హైఖాన్, శ్రీశైలం గ్రామస్థుల సహకారంతో తాళ్లతో బయటకు తీశారు. ప్రథమ చికిత్స అందించి మర్రిమడ్ల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. వేసవిలో అటవీ జంతువులు నీటి కోసం వచ్చి ప్రమాదంలో పడిపోతాయని అటవీ ప్రాంతంలోనే నీటి కుండీలను ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చాలని గ్రామస్థులు కోరారు.

ఒకరిపై కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, మార్చి 4: సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్‌పై నమోదైన కేసును తీసివేయిస్తానని చెప్పి డబ్బులు డిమాండ్ చేసిన తుమ్మ విజయ్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరుకు చెందిన కొంపల్లి విష్ణువర్ధన్ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టు బడిందని తెలిపారు. ఈ కేసును తొలగిస్తానని పెద్దూరుకు చెందిన విజయ్ పోలీసువారితో మాట్లాడుతానని రూ.50వేలు ఇవ్వాలని, ఇవ్వకుంటే చంపుతానని బెదిరించాడని బాధితుడు విష్ణువర్ధన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

గత ప్రభుత్వ తప్పుడు హామీలు అమలు చేయం

తిమ్మాపూర్, మార్చి4: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు హామీలను ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండల సమావేశం సోమవారం ఎంపీపీ కేతిరెడ్డి వనిత అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవి దృష్ట్యా ప్రజలకు మంచి నీటి సమస్యలు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. మొగిళిపాలెం ఎంపిటిసి పాశం తిలక్ ప్రియా లేచి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునేందుకు చాలా మందికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొసీడింగ్‌లు ఇచ్చిందని, ఇళ్లకోసం వారు ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్యేను అడిగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత, వైస్ ఎంపిపి ల్యాగల వీరారెడ్డి, తహసీల్దార్ కనకయ్య, ఎంపిడివో విజయ్‌కుమార్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తిమ్మాపూర్: కరీంనగర్ ఎంపీగా ఐదేళ్ల పదవీకాలంలో మానకొండూర్ నియో జకవర్గానికి చేసిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎంపీ బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు 14మంది దరఖాస్తు చేసుకున్నారని, అభ్యర్థి ఎవరైనా కరీంనగర్‌లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణ రెడ్డి, జిల్లా మండల నాయకులు శ్రీగిరి రంగారావు, ఎస్ఎల్ గౌడ్, తిరుపతి రెడ్డి, ఇతర నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.